# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 12 జూన్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 332

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు స్కూళ్లు



**హైదరాబాద్** రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్‌ఏఐకి 626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

# మోదీజీ.. తెలంగాణకు 7 వరాలివ్వండి

- ప్రధానిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- మెట్రో సిటీల ప్రగతిపై దృష్టిపెట్టండి
- ఒక్కో నగరానికి రూ.లక్ష కోట్లు ఇవ్వండి
- నీతి ఆయోగ్ సమావేశంలో విజ్ఞప్తి చేసిన రేవంత్‌రెడ్డి
- విద్య, వైద్యంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్య

రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి మెట్రో ఫేజ్-2 ను వెంటనే ఆమోదించాలి వివిధ ప్రాజెక్టులపై ప్రధానితో సిఎం చర్చలు ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు.

దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది విద్య,వైద్యంతోనే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యం వెనకబాటు నిర్మూలనకే యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం సామాజిక వెనకబాటుకు విద్యలేమి కారణంగా తేలింది తెలంగాణ అభివృద్ధి నమూనాపై ప్రత్యేకంగా ప్రస్తావన నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ ప్రసంగం తెలంణాకు ఐఐఎం అసవరాన్ని గుర్తించాలని వినతి ప్రధాని మోడీతో ప్రత్యేక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ

దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డబ్బు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కులసర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే.. విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు.




# ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత

ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ




# రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు మంగళం

ధాన్యం సేకరణలో తీవ్ర నిర్లక్ష్యంగా ప్రభుత్వం

తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి 1200 కోట్లు దోపిడీ

రైతు పక్షాన తెలంగాణ రక్షణ సేన పోరాటం

నల్లగొండలో రైతు రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత

# ఇగ్నైట్ పేరుతో క్యూనెట్ కొత్త అవతారం

5వేల కోట్ల భారీ కుట్ర భగ్నం చేశాం: సిపి సజ్జన్నార్



హైదరాబాద్: గతంలో నిషేధానికి గురైన క్యూనెట్ సంస్థ సరికొత్తగా ఇగ్నైట్ పేరుతో అవతారమెత్తిందని సీపీ సజ్జనర్ తెలిపారు. ఆ సంస్థ చేయాలనుకున్న దాదాపు రూ.5వేల కోట్ల భారీ మోసం కుట్రను భగ్నం చేసినట్లు ఆయన వెల్లడించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడారు. ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్ గత 25 ఏళ్లుగా 'గోల్డ్ క్వెస్ట్', 'క్వెస్ట్ నెట్' 'క్యూనెట్'.. ప్రస్తుతం 'ఇగ్నైట్'గా పేరు మార్చుకుని అమాయకులను దోచుకుందని సీపీ వివరించారు. దేశంలో లక్షల్లో బాధితులున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మామిడిపండ్లు తిని అక్కాచె÷-లలెళ్లు చనిపోయిన ఘటనపై సీసీ సజ్జనర్ స్పందించారు. బాలికల అంతర్గత అవయవాల నమూనాలు భద్రపరచాలని ఆదేశించామని.. వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటున్నామని చెప్పారు. బాలికల మరణాలకు కారణాలు కనుగొంటామన్నారు. నారాయణగూడ పీఎస్ పరిధి విఠల్‌వాడిలో ఇద్దరు బాలికలు మృతిచెందిన విషయం తెలిసిందే.




# ఈ రాత్రికే భీకర దాడులు తప్పవు

మరోమారు ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

# మోడీ పాలనలో సామాన్యుల బతుకు దుర్భరం

మీనాక్షినటరాజన్ పై తెలంగాణలో ఎక్కడా కేసు లేదు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో బతుకుడే కష్టంగా మారిందన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతూ పోతున్నాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈరోజు (గురువారం) ఢిల్లీ వేదికగా మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళా అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని చెప్పుకొచ్చారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తాం



హైదరాబాద్: ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదన్నారు. ఫార్మాసిటీ కోసం తాను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా అని అన్నారు. ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా అన్నారు. . ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరని హరీశ్‌రావు ప్రశ్నించారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిగా దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరించడం వెనుక రాష్ట్రంలోని ఆ పార్టీ నేత హస్తం ఉందని హరీశ్ రావు ఆరోపించారు. ఆమెకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఉన్నట్లు తెలంగాణ నుంచే తమకు సమచారం అందిందని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రే చెప్పారని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ కేసును బీజేపీ మంత్రికి లీక్ చేసింది ఎవరని.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ కేసును లీక్ చేసింది ఎవరనే దానిపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్), జ్యుడీషియరీ ఎంక్వైరీ వేస్తావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చెప్పిన వ్యక్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వలేదని విమర్శించారు. అందుకే ఆ వ్యక్తి మధ్యప్రదేశ్ మంత్రికి సమాచారం ఇచ్చారని తెలిపారు. దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి అనుచరుడు ఉన్నారని చెప్పారు. రూ. 100 కోట్లతో తన నివాసం సమీపంలో బోధి పెవిలియన్ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం నిర్మిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఈ ఇంటి నిర్మాణం కోసం పదుల సార్లు సీఎం అక్కడికి వెళ్లారని చెప్పారు. ఇనుప కంచెలకి రూ.17 కోట్లు.. రక్షణ కోసం, ఫుట్ బాల్ ఆడేందుకు రూ.10 కోట్లు కేటాయించారన్నారు. అలాగే కౌన్సిల్‌లో సీఎం ఛాంబర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. పని చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రజాధనం వృధా చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 7 కోట్లతో జీవో ఇచ్చి ఇప్పటికే రూ.70 కోట్ల పైన ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నగదు లేదు కానీ సీఎం సోకులకు రూ. వందల కోట్లు ఖర్చు పెడతారా? అంటూ హరీశ్ రావు అసహనం వ్యక్తం చేశారు.

- అక్కడి భూములు ఫార్మా కోసం సేకరించాం
- వాటిని మార్పు చేస్తే చట్టం ఒప్పుకోదు
- జర్నలిస్టులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలి
- మీనాక్షనటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ వెన్నుపోటు
- వందకోట్ల ప్రజాధనంతో సిఎం సొంతిల్లు నిర్మాణం
- మాజీమంత్రి హరీష్ రావు ఘాటు విమర్శలు




# సర్ ప్రక్రియపై ఎందుకంత భయం

దొంగ ఓట్లు తొలగిస్తే భయపడాలా

విపక్షాల తీరుపై మండిపడ్డ బిజెపి నేత రామచంద్రరావు

## ఈ రాత్రికే భీకర దాడులు తప్పవు మరోమారు ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఈరోజు రాత్రి ఇరాన్‌పై చాలా తీవ్రంగా దాడి చేస్తాం' అని తన సోషల్ మీడియా 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. ట్రంప్ ప్రకటన పశ్చిమాసియా దేశాలలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. కేవలం సైనిక చర్యలకే పరిమితం కాకుండా, ఇరాన్‌కు అత్యంత కీలకమైన చమురు, సహజవాయు మౌలిక వసతులపై కూడా నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌కు ప్రధాన చమురు ఎగుమతి కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపం సహా పలు చమురు మౌలిక వసతులను నియంత్రణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో వెనెజువెలాపై అనుసరించిన వ్యూహంతోనే ఇరాన్‌ను నియంత్రణలోకి తీసుకుంటామన్నారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన, రాడార్, క్షిపణి నిరోధక వ్యవస్థలతో పాటు రక్షణ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు ఇప్పటికే నాశనమయ్యాయి. సమీప భవిష్యత్తులో ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఆయా మార్కెట్లపై నియంత్రణ సాధిస్తాం. వెనెజువెలాలో చేసిన మాదిరిగానే ఇరాన్‌లో కూడా మా ప్రణాళిక ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు మంగళం



నల్గొండ: తరుగు, రవాణా పేరుతో రైతుల వద్ద నుంచి రూ.1200 కోట్లు కప్పం కట్టించుకున్న సిగ్గు లేని ప్రభుత్వం ఇదంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నల్గొండలో రైతు సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్ ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. మట్టి తల్లిని అలుసుగా చూస్తూ వ్యవసాయాన్ని కర్మకు వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు ఉక్కు సంకల్పం ఉంటే వ్యవసాయ రంగంలో అద్భుతాలు చేయవచ్చని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న సౌకర్యాలు రైతులకు కూడా ఇవ్వాలని ప్రభుత్వానికి ఈ సందర్భంగా కవిత సూచించారు. రైతును రాజు చేసేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని వివరించారు. అన్నదాతల కష్టాలను, వారి గొంతుకను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నల్లగొండను వేదికగా ఎంచుకున్నట్లు టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, సామాజిక న్యాయంతో పాటు.. రైతుకు గౌరవం ఇవ్వడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆమె ప్రకటించారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత ధ్వజమెత్తారు. పంట చేతికొచ్చినా రైతులకు పెట్టుబడి సాయం అందలేదని.. మృగశిర కార్తె ప్రారంభమైనా ఇప్పటివరకు రైతు భరోసా నిధులు విడుదల కాలేదని మండిపడ్డారు. పెట్టుబడుల కోసం అన్నదాతలు మళ్లీ అప్పులు, తాకట్టుల వైపు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు ధాన్యం కొనుగోళ్లలో రవాణా భారాన్ని రైతులపైనే మోపడమే కాకుండా.. క్వింటాకు 6 కిలోల తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు వ్యవసాయ శాఖపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం.. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మూడుసార్లు రైతు భరోసాను ఎగ్గొట్టారని, రుణమాఫీ కూడా పూర్తి కాలేదని.. కేవలం ఎన్నికల సమయాన్నే చూసి నిధులు విడుదల చేస్తున్నారని విమర్శించారు. రైతులు పోరాటాలు చేస్తేనే ప్రభుత్వం నిద్ర లేస్తోందని కవిత దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని కవిత ఆరోపించారు. జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని.. మునుగోడు, దేవరకొండ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నల్లగొండకు కూడా నీళ్లు ఇవ్వాలని కోరారు. మరోవైపు అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్న హామీ ఎటు పోయిందని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రులే పెద్ద ఎత్తున అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తున్నారని.. ఆ భూముల రక్షణ కోసం రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. 'రైతు డిస్కం' పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు, విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని హెచ్చరించారు. తెలంగాణ రక్షణ సేన అనే ఈ కొత్త పార్టీకి, ప్రజల పక్షాన నిలిచే తమ పోరాటానికి ప్రజలందరూ సలహాలు, సూచనలు అందించి మద్దతుగా నిలవాలని కవిత కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో 10 తీర్మానాలు ఆమోదించినట్లు కవిత తెలిపారు. రైతు డిస్కం వద్దని, యూరియా యాప్ తీసేయాలని, బకాయి పడ్డ రైతు భరోసా తక్షణమే అందించాలని, కౌలు రైతులను గుర్తించి వారికి రైతు భరోసా ఇవ్వాలని, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని, మూసీ నదిలో కాలుష్యాన్ని నివారించాలని, నిమ్మ, బత్తాయి రైతులకు అండగా నిలవాలని, పత్తి రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలనపి, రైతు సమస్యలపై ఉమ్మడి కార్యాచరణతో భవిష్యత్ ఉద్యమాలు చేయాలని తీర్మానించారు. .

## హామీలు నెరవేర్చలేక కేంద్రంపై నిందలా

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ డికె అరుణ**

మహబూబ్‌నగర్, రాష్ట్ర ప్రభుత్వం పనులు చేయలేక కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. గురువారం మక్తల్‌లో ఎంపీ డీకే అరుణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రహదార్లు, అంగన్వాడీ కేంద్రాలు, భవనాలు, బాలింతలకు, గర్భిణీలకు కేంద్ర ప్రభుత్వమే పౌష్టిక ఆహారం అందిస్తుందన్నారు. ఈ రెండున్నర ఏళ్లలో ఏ ఒక్క పెండింగ్ పనులు చేయలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రాంతాల మధ్య విద్వేషాలు, సెంటిమెంట్‌తో మాయమాటలు చెప్పి అధికారంలో వచ్చాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మరొక్కసారి గారడి మాటలతో అబద్ధం చెప్పి అధికారంలో వచ్చాడని మండిపడ్డారు. రెండు తులాల బంగారం, మహిళలకు రూ.2 వేల పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చేసిన అభివృద్ధి ఏమిటని ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కార్ చేసిన అప్పు ఎంతో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కొడంగల్‌లో రోడ్లు వేస్తే సరిపోదని.. రాష్ట్రమంతా వేయాలన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఇంటి జాగా లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు ఇస్తామన్న హామీ ఏమైందంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. దేశంలో అధిక కాలం ప్రధాన మంత్రి పదవి చేపట్టి ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారన్నారు. దేశాన్ని అన్ని రకాలుగా బీజేపీ అభివృద్ధి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకే దేశ ప్రజలు మూడోసారి బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారని డీకే అరుణ చెప్పారు.

# పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం





న్యూఢిల్లీ: పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత



హైదరాబాద్::ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గురువారం జలసౌధలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష నిర్వహించారు.సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ఖమ్మం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు, పాత ఆయకట్టుకు స్థిరీకరణ చేస్తామన్నారు. మున్నేరు - పాలేరు అనుసంధానం.. ఖమ్మం, సూర్యాపేట రైతులకు వరమన్నారు. విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటిని మళ్లించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని.. ప్రతి ప్రాజెక్టుకు గడువులు నిర్దేశిరచి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# పుట్టగొడుగుల్లా ప్రైవేట్ బడులు







- విద్యాశాఖ అనుమతులు లేకుండానే జోరుగా అడ్మిషన్లు.
- లక్షల రూపాయల్లో ఫీజుల వసూళ్లు
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.
- జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఇష్టారాజ్యం.
- నామ మాత్రంగా స్పందించి, చేతులు దులుపుకున్న విద్యా శాఖ అధికారులు.

"ధనార్జనే ధ్యేయంగా జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కనీస నిబంధనలు, విద్యాశాఖ అనుమతులు లేకుండానే అడ్మిషన్ లు చేపడుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను మొదట్లోనే అడ్డుకట్ట వేయాల్సిన విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూళ్లు చేసి, పెద్ద ఎత్తున అడ్మిషన్ లు చేపట్టిన తర్వాత అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేరిపించవద్దని విద్యాశాఖ అధికారులు పత్రిక ప్రకటనా విడుదల చేసి చేతులు దులుపుకున్నారు."

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

ప్రీ ప్రైమరీ స్కూల్స్ కు అనుమతులు అక్కర్లేదంటూ జిల్లా, కేంద్రంతో పాటు పట్టణాల్లోనూ ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్నారు. జిల్లాలో వందకు పైగా అనుమతులు లేని పాఠశాలలు ఉన్నట్టు తెలుస్తుంది. దూర ప్రాంతాలకు చిన్న పిల్లలను పంపలేని విద్యార్థుల తల్లి దండ్రులు తమ పిల్లలను ఇంటికి దగ్గరలో ఉన్నా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా ప్రీ ప్రై మరీ తరగతులు అయిన నర్సరీ, పీపీ-1, పీపీ-2 తరగతులకు విద్యాశాఖ అనుమతులు అవసరం లేదంటూ చెబుతూ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా నగరంలోని గూపన్ పల్లి ప్రాంతంతోపాటు కేశాపూర్లో ఏర్పాటు చేస్తున్న రెండు కార్పొరేట్ స్కూల్లకు ఇంకా విద్యాశాఖ నుంచి అనుమతి లభించకపోగా తమకు అనుమతులు వచ్చాయంటూ ఆ స్కూల్స్ అడ్మిషన్లు తీసుకోవడంపై వి ద్యార్థి సంఘాలు ఆగ్రహంవ్యక్తంచేస్తున్నాయి.

**కనీస నిబంధనలు బేఖాతర్:**

ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేయాలంటే విద్యాశాఖ నిబంధనల ప్రకారం చలాన్ చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుంది. నూతన పాఠశాల ఏర్పాటుతో పాటు పాఠశాలల రెన్యూవల్ కు సంబంధించి గత అక్టోబరు నెలలోనే చలాన్ చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇంకా చలాన్ లను చెల్లించలేదు. విద్యాశాఖలో ఫైల్స్ పెండింగ్ లో ఉన్నాయని చెబుతూ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాల అనుమతి పొందాలంటే పట్టణాలలో వెయ్యి చద రపు మీటర్లు, గ్రామాలలో 2వేల చదరపు మీటర్ల ఆట స్థలం ఉండాలి. అగ్నిమాపక శాఖ, రోడ్లు భవనాలశాఖ, పారిశుధ్యశాఖ, పోలీసుశాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వేర్వే రుగా మరుగుదొడ్లు, లైబ్రరీ, ఇతర సౌకర్యాలతో పాటు రూ.50వేల ఎండోమెంట్ రుసుం చెల్లించాలి. కానీ ఇవేమీ లేకుండానే అద్దె భవ నాల్లో ప్రైవేట్ పాఠశాలలను ఏర్పా టు చేస్తున్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేకుండా ఇంటర్, డిగ్రీ పాస్ అయిన వారితో తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్య త్తుతో ఆటలు అడుతున్నారు. నగరంలో ఇటీవల కాలంలో రెండు కార్పొరేట్ పాఠశాలలు తమకు అనుమతులు వచ్చేశాయంటూ భారీ హోర్డింగ్లు ఏర్పాటు చేస్తూ అడ్మిషన్లు పొందడం వివాదాస్పదమవుతోంది. ఇంకా ఆ బడులకు విద్యాశాఖ నుంచి అనుమ తులు లేవని డీఈవో ప్రకటన ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

**అనుమతులు లేని పాఠశాలల సీజ్ కు ఆదేశం: డీఈవో.**

జిల్లాలో అనుమతులు లేకుండా, ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్ల విషయంలో మండ ల విద్యాశాఖ అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే స్కూల్లను సీజ్ చేయాలని ఆదేశించాం. కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూ ల్ పేరుతో ప్రకటనలు ఇస్తూ అడ్మిషన్లు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఆ స్కూల్లపై జీవో నంబర్ 1 ప్రకారం క్రిమినల్ కేసులు పెడతాం, విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తింపులేని, ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకొని పిల్లల భవిష్యత్తు ప్రమాదంలోకి నెట్టొద్దు.

# ఎపిలో నేటినుంచి బడిగంటలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బడిగంటకు వేళాయింది. దాదాపు రెండు నెలల విరామం తర్వాత స్కూళ్లు తెరుచుకోబోతున్నాయి. శుక్రవారం నుంచి స్కూళ్లు పున:ప్రారంభం అవుతున్నాయని విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఏడాది క్యాలెండర్‌ను విడుదల చేసింది. 229 పని దినాలు, 87 రోజులు సెలవు దినాలుగా ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం విద్యాశాఖ విడుదల చేసింది. రెండు నెలల పాటు చిన్నారులు ఆటాపాటలతో ఎంజాయ్ చేశారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఇప్పుడు మళ్లీ బ్యాగ్‌లు భుజాన వేసుకుని.. పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం దగ్గర పడింది. నేటితో వేసవి సెలవులు ముగియడంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. విద్యాశాఖ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం.. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 పని దినాలు ఉండగా, 87 రోజులు సెలవులు కేటాయించారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు పాఠ్యాంశాల పూర్తి, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో దసరా, సంక్రాంతి, క్రిస్మస్ తదితర ప్రధాన పండుగల సందర్భంగా సెలవులను ప్రకటించారు. అలాగే ప్రభుత్వ సెలవులు, ఆదివారాలు కలిపి మొత్తం 87 రోజుల విరామం లభించనుంది.అంతేకాకుండా విద్యాశాఖ వార్షిక పరీక్షలు, త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, సమయపాలన పాటించడం లక్ష్యంగా పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించినట్లు పేర్కొంది.

## నిజామాబాద్ "ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్" నూతన కార్యవర్గం ఎన్నిక.

**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**



ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జెట్టి గోవిందరాజు సమక్షంలో ఈ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం రాబోయే రెండు సంవత్సరాల పాటు అసోసియేషన్ బాధ్యతలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎన్నికైన నూతన కమిటీకి ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గం:గౌరవ అధ్యక్షులు: జెట్టి గోవిందరాజు, అధ్యక్షుడు: ఎల్. రతన్ రెడ్డి (ఆంధ్రజ్యోతి), కార్యదర్శి: ఎం.ఎస్. భాను తేజ (వి6 వెలుగు), ఉపాధ్యక్షుడు: బి.రాజ్ కుమార్ (సాక్షి), కోశాధికారి (ట్రెజరర్):ఎన్. శ్రీనివాస్ కుమార్ (నమస్తే తెలంగాణ), ముఖ్య సలహాదారు: మల్లెపూల నరసింహ చారి, కార్యవర్గ సభ్యులు: ఈ. శ్రీనివాస్, బాలరాజ్ లు నియమితులయ్యారు నియమితులైన నూతన కార్యవర్గ సభ్యులు అసోసియేషన్ అభివృద్ధికి, తోటి ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సభ్యులు ఆకాంక్షించారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు

**వన్డే, టీ20ల్లో అగ్రస్థానం పదిలం**



ముంబై -- 11-06-2026 -- .:
అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన వార్షిక ర్యాంకింగ్స్ నవీకరణలో భారత జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. పురుషుల వన్డే, టీ20 ఫార్మాట్లలో ప్రపంచ నంబర్-1 జట్టుగా భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ 118 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ జట్టు 113 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తోంది. గతంతో పోలిస్తే రెండు జట్ల మధ్య ఉన్న పాయింట్ల తేడా తగ్గడంతో అగ్రస్థాన పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియా జట్టు 109 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. తొలి మూడు స్థానాల్లో ఎలాంటి మార్పులు లేకపోయినా, తరువాతి స్థానాల్లో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణాఫ్రికా జట్టు 102 పాయింట్లతో ఒక స్థానం మెరుగుపరుచుకుని నాలుగో స్థానానికి చేరుకుంది. దీంతో పాకిస్థాన్ జట్టు 98 పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయింది. ఈ మార్పు తాజా ర్యాంకింగ్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దిగువ స్థానాల్లో కూడా కొన్ని ఆసక్తికర మార్పులు చోటుచేసుకున్నాయి. ఐర్లాండ్ జట్టు జింబాబ్వేను వెనక్కి నెట్టి 11వ స్థానానికి చేరుకోగా, అమెరికా జట్టు స్కాట్లాండ్‌ను అధిగమించి 13వ స్థానంలో నిలిచింది. ఇక టెస్టు క్రికెట్ విష యానికి వస్తే ఆస్ట్రేలియా జట్టు అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. సు దీర్ఘ ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగుతుండగా, భారత్ పరిమి త ఓవర్ల క్రికెట్‌లో తన బలాన్ని మరో సారి నిరూ పిం చింది. మహిళల క్రికెట్‌లో కూడా ఆస్ట్రేలి యా జట్టు తన ఆది ,పత్యాన్ని కొనసాగిస్తోంది. మహిళల వన్డే, టీ20 ఫార్మాట్లలో ఆస్ట్రేలియా ప్రపంచ నంబర్-1 జట్టుగా నిలిచింది. తాజా ర్యాం కింగ్స్‌తో ప్రపంచ క్రికెట్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్ల ఆధిపత్యం మరోసారి స్పష్టమైందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆఫ్ఘన్ చేతిలో భారత్‌కు షాక్ డీఎల్ఎస్‌తో ఓటమి



ముంబై -- 11-06-2026 -- .:
ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ జట్టుకు అఫ్ఘనిస్తాన్-ఏ జట్టు షాక్ ఇచ్చింది. వర్షం కారణంగా పలుమార్లు అంతరాయం ఏర్పడిన మ్యాచ్‌లో డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ విధానం ప్రకారం అఫ్ఘనిస్తాన్-ఏ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు 49 ఓవర్లలో 349 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ప్రభుసిమ్రన్ సింగ్ 84 పరుగులతో రాణించగా, తిలక్ వర్మ 66, రుతురాజ్ గైక్వాడ్ 66 పరుగులు చేశారు. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 44 పరుగులతో వేగవంతమైన ఆరంభాన్ని అందించాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఓవర్లు కుదించడంతో అఫ్ఘనిస్తాన్-ఏకు 38 ఓవర్లలో 294 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. లక్ష్య ఛేదనలో అఫ్ఘన్ బ్యాటర్లు ధైర్యంగా ఆడుతూ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయే సమయానికి అఫ్ఘనిస్తాన్-ఏజట్టు 25.5 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ లెక్కల ప్రకారం ఆసమయంలో అఫ్ఘన్ జట్టు నాలుగు పరుగుల ఆది .క్యంలో ఉండటంతో విజేతగా ప్రకటించారు. అఫ్ఘనిస్తాన్ తరఫున ఇమ్రాన్ అజేయంగా 75 పరుగులు చేయగా, బహిర్ షా 51 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయానికి చేరువ చేశారు. భారీ స్కోరు చేసినప్పటికీ వర్షం కారణంగా భారత్-ఏకు అదృష్టం కలిసి రాలేదు. అఫ్ఘన్ బ్యాటర్ల పోరాటంతో భారత్-ఏ జట్టుకు అనూహ్య ఓటమి ఎదురైంది. ఈ విజయంతో అఫ్ఘనిస్తాన్-ఏ జట్టు సిరీస్‌లో కీలక విజయం నమోదు చేసింది.

# 2027 ప్రపంచకప్‌కు రోహిత్ కోహ్లీ రైనా అభిప్రాయం



ముంబై -- 11-06-2026 -- .:
2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో కీలకమని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు అండగా ఉంటే జట్టు మరింత బలంగా మారుతుందని పేర్కొన్నాడు. పెద్ద టోర్నీల్లో అనుభవం అత్యంత ముఖ్యమని రైనా చెప్పాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే ఇరవై ఓవర్ల, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికి ప్రస్తుతం వన్డేలపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ప్రపంచకప్‌లలో ఈ ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని గుర్తు చేశాడు. 2019 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యధిక పరుగులు సాధించగా, 2023 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ టోర్నీ అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడని రైనా వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్వహించే ప్రధాన టోర్నీల్లో విజయం సాధించిన అనుభవం వారికి ఉందని, కీలక నాకౌట్ మ్యాచ్‌ల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పాడు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగకరమని రైనా అభిప్రాయపడ్డాడు. శుభ్‌మన్ గిల్ తొలిసారి ప్రపంచకప్‌లో భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నాడు. ఇదే సమయంలో మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురి పించాడు. నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పటికీ గిల్ బ్యాటింగ్‌పై ఎలాంటి ప్రభావం పడలేదని అన్నా డు. ఇటీవల జరిగిన లీగ్ పోటీల్లో కూడా అతడు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ అద్భుత ప్రదర్శన చేశాడని కొనియాడాడు. గిల్‌కు అనుభ,వజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం పెద్ద బలమని కుంబ్లే పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డింగ్ అమరికలు, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో యువ కెప్టెన్‌కు సహకారం అందుతుందని చెప్పాడు. అందువల్ల నాయకత్వ బాధ్యతల భారం పూర్తిగా గిల్‌పైనే పడదని, సీనియర్ల అనుభవం భారత జట్టుకు 2027 ప్రపంచకప్‌లో కీలకంగా మారే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## ప్రపంచకప్‌కు వీడ్కోలు చెప్పనున్న దిగ్గజాలు

# ఇదే చివరి పోరు



ముంబై -- 11-06-2026 -- :
ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రారంభానికి రంగం సిద్ధమవుతున్న వేళ ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ మెగా టోర్నీ కేవలం ప్రపంచ విజేతను నిర్ణయించడమే కాకుండా ఓ స్వర్ణయుగానికి ముగింపు పలకనుంది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ ఫుట్‌బాల్‌ను శాసించిన పలువురు దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్‌గా నిలిచే అవకాశం ఉంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఇప్పటికే ప్రపంచకప్ గెలిచి తన కలను సాకారం చేసుకున్నాడు. 2022లో జట్టుకు టైటిల్ అందించిన మెస్సీ, ఇప్పుడు వరుసగా రెండోసారి అర్జెంటీనాను విజేతగా నిలపాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాడు. ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన మెస్సీకి ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు మాత్రం ప్రపంచకప్ ఇంకా అందని కలగానే మిగిలిపోయింది. ఎన్నో రికార్డులు, ట్రోఫీలు గెలిచిన రొనాల్డో తన కెరీర్‌లో ప్రపంచకప్‌ను మాత్రమే అందుకోలేకపోయాడు. 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న అతనికి ఈ టోర్నీ చివరి అవకాశం కానుంది. క్రొయేషియా దిగ్గజం లూకా మోడ్రిచ్ కూడా తన చివరి ప్రపంచకప్ ఆడనున్నాడు. 2018 లో జట్టు ను ఫైనల్‌కు చేర్చిన మోడ్రిచ్, ఇ ప్పటికీ క్రొ యేషియా జట్టుకు కీలక శక్తి గా కొనసాగుతున్నాడు. ఈ టోర్నీ తో అతని అద్భుతమైన అంత ర్జాతీయ కెరీర్ ముగిసే అవకా శం ఉంది. జర్మనీ స్టార్ థామస్ ముల్లర్ కూడా చివరిసారి ప్రపంచకప్ వేదికపై కని పించనున్నాడు. 2014లో జర్మనీ విజయంలో కీలక పాత్ర పోషించిన ముల్లర్, తన అనుభవంతో మరోసారి జట్టుకు సేవలందించేందుకు సిద్ధమయ్యాడు. బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని సంకేతాలు ఇచ్చాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచిన నెయ్‌మార్, ఆరో ప్రపంచకప్ టైటిల్‌ను దేశానికి అందించాలనే లక్ష్యంతో చివరిసారి బరిలోకి దిగనున్నాడు. మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్, ముల్లర్, నెయ్‌మార్ వంటి దిగ్గజాల కోసం ఈ ప్రపంచకప్ మరింత ప్రత్యేకంగా మారింది. ప్రపంచ విజేత ఎవరో తేలడమే కాకుండా, ఫుట్‌బాల్ చరిత్రలో ఓ గొప్ప తరం ఆటగాళ్లకు వీడ్కోలు పలికే వేదికగా కూడా ఈ టోర్నీ నిలవనుంది.

# వింబుల్డన్‌లో రికార్డు బహుమతి విజేతకు రూ.40 కోట్లు



ముంబై -- 11-06-2026 -- :
ప్రపంచ ప్రఖ్యాత వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో ఈసారి రికార్డు స్థాయిలో బహుమతి నగదును ప్రకటించారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 48 లక్షల డాలర్ల బహుమతి అందించనుండగా, ఇది భారత కరెన్సీలో సుమారు రూ.40 కోట్లకు సమానం. టోర్నీ తొలి రౌండ్ లోనే ఓడిపోయిన ఆటగాళ్లకు కూడా కనీసంగా 80 వేల పౌండ్ల పారితోషికం అందించనున్నారు. అర్హత పోటీల కోసం సుమారు 60 లక్షల పౌండ్లను కేటాయించిన నిర్వాహకులు, గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెంపు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తం బహుమతి నగదు 64.2 మిలియన్ పౌండ్లకు చేరుకుంది. వింబుల్డన్ చరిత్రలోనే ఇదే అత్యధిక బహుమతి నగదని నిర్వాహకులు వెల్లడించారు. ఆల్ ఇంగ్లండ్ క్లబ్ చైర్ దెబోరా జీవన్స్ మాట్లాడుతూ ఆటగాళ్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రౌండ్లలోనూ పారి తోషికాలను పెంచినట్లు తెలిపారు. టోర్నీ ఆదాయంలో మరింత వాటా ఆటగాళ్లకు ఇవ్వాలన్న డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో బహుమతి నగదు 9.5 శాతం పెరిగినప్పటికీ, పలువురు ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు నిరసనలు కూడా చేపట్టారు. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో బహుమతి నగదు 20 శాతం పెంచగా, ఈ ఏడాది వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. గత ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విభాగంలో జానిక్ సిన్నర్ విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ టైటిల్ కైవసం చేసుకుంది. ఈసారి రికార్డు స్థాయి బహుమతులతో వింబుల్డన్ మరింత ఆసక్తికరంగా మారనుంది.



## 350 పరుగుల లక్ష్యం ఆఫ్ఘన్ ముందు భారత్


# భారీ స్కోరు

ముంబై -- 11-06-2026 -- :
ముక్కోణపు సిరీస్‌లో భాగంగా అఫ్ఘనిస్తాన్-ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. దీంతో అఫ్ఘనిస్తాన్-ఏ జట్టు విజయానికి 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచిన అఫ్ఘని స్తాన్-ఏ జట్టు ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించిం ది. ఇన్నిం గ్స్ ఆరంభం నుంచే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఎదు రుదాడికి దిగాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినప్పటికీ అనూహ్యంగా ఔటయ్యాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 84 పరుగులు సాధించాడు. మధ్య వరుసలో రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు బలమైన పునాది వేశారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. చివర్లో సూర్యాంశ్ షెడ్జ్ వేగంగా పరుగులు సాధించి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. 27 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టు స్కోరు బోర్డును పరుగెత్తించాడు.

## ఆస్ట్రేలియా జట్టులో భారత క్రికెటం 60 ఏళ్ల

# తర్వాత అరుదైన ఘనత

ముంబై -- 11-06-2026 -- .:
భారత సంతతికి చెందిన క్రికెటర్ నిఖిల్ చౌదరీ ఆస్ట్రేలియా జాతీయ జట్టులో చోటు దక్కించుకుని అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన నిఖిల్, తుది జట్టులో అవకాశం దక్కితే వచ్చే వారం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం చేయను న్నాడు. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత భారత మూలాలు కలిగిన ఓ పురుష క్రికెటర్ ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో ఈ ఎంపికకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.



ప్రస్తుతం నిఖిల్ హోబార్ట్ హరికేన్స్ జట్టు తరఫున దేశీయ క్రికె ట్ ఆడుతున్నాడు. ఇటీవల బెల్జియంలో జరుగుతున్న ఈయూ 20 పోటీల్లో జేబీ బ్రూగ్స్ జట్టు తరఫున కూడా అతను ప్రాతి నిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి స్పిన్ బౌలర్‌గా గుర్తింపు పొందిన నిఖిల్ అవసరమైన సమయంలో విలువైన పరుగులు చేయగల సమర్థుడైన బ్యాటర్ కూడా. బంగ్లాదేశ్‌తో జూన్ 17 నుంచి 21 వరకు జరిగే టీ20 సిరీస్‌లో మధ్య వరుస స్థానం కోసం జోయెల్ డేవిస్, ఆరన్ హార్డీతో నిఖిల్ పోటీ పడనున్నాడు.

## ద్రవిడ్ వారసుడు టీమిండియాలో అన్వయ్‌కు

# అండర్-19 పిలుపు

ముంబై -- 11-06-2026 .:
భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవి డ్ కుటుంబం నుంచి మరో క్రికెట ర్ జాతీయ జట్టులోకి అడుగు పెట్టను న్నాడు. ద్రవిడ్ చిన్న కుమారు డు, వికె ట్ కీపర్ బ్యాటర్ అన్వయ్ ద్రవిడ్‌కు భార త అండర్-19 జట్టులో చోటు దక్కింది. వచ్చే నెల శ్రీలంక పర్యటనకు ఎంపికైన జట్టులో అతనికి అవకాశం కల్పించారు.



భారత క్రికెట్ నియంత్రణ మండలి శ్రీలంక పర్యటన కోసం అండర్-19 జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు యశ్‌వర్ధన్ సింగ్ చౌహాన్ నాయకత్వం వహించనున్నాడు. జూలై 4 నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటనలో భారత్-19 జట్టు శ్రీలంకతో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడనుంది. వన్డే జట్టులో ఎంపికైన ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లలో అన్వయ్ ద్రవిడ్ ఒకడు. గతంలో కూడా భారత అండర్-19 స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన అన్వయ్, దేశీయ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో మరోసారి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. గత ఏడాది అఫ్గానిస్థాన్ అండర్-19 జట్టుతో జరిగిన సిరీస్‌లో భారత్ 'బి' జట్టు తరఫున అన్వయ్ ఆడాడు. తాజాగా దేశీయ పోటీల్లో మెరుగైన ఆటతీరుతో జాతీయ జట్టులో తిరిగి స్థానం సంపాదించుకున్నాడు. అండర్-19 వన్డే జట్టులో సాగర్ విర్క్, యశ్‌వర్ధన్ సింగ్ చౌహాన్, లక్ష్య రాయచందాని, వినీత్ వీకే, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘేల్, అన్వయ్ ద్రవిడ్, అన్మోల్జీత్ సింగ్, వూట్కూరి యశ్వీర్ గౌడ్ తదితరులు చోటు దక్కించుకున్నారు.




# బాలయ్య కొత్త చిత్రం..ఎన్బీకె 111 టీజర్

గాడ్ ఆఫ్ మాసెస్.. ఈ ట్యాగ్ కి అర్హత ఉన్న ఏకైక టాలీవుడ్ నటుడు నందమూరి నటసింహం బాలకృష్ణ మాత్రమే. అసలు మాస్ అంటే బాలయ్య.. బాలయ్య అంటే మాస్. టాలీవుడ్ మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ బాలయ్య. దాదాపు మూడు దశాబ్దాల క్రితమే మాస్ సినిమా అంటే ఎలా ఉంటుందో.. ముద్దుల మావయ్యతో మాస్ హిట్ అందుకున్న బాలయ్య, లారీ డ్రైవర్ తో మాస్ కి పూనకాలు తెప్పించి సమరసింహారెడ్డితో ట్రెండ్ సెట్టర్ మారి గాడ్ ఆఫ్ మాస్ గా మారారు. అప్పటి నుంచి బాలయ్యలోని మాస్ హీరో ఆడియెన్స్‌ను అలరిస్తునే ఉన్నాడు. దర్శకులు బాలయ్య కోసం రాసుకున్న మాస్ కథలు ఎన్నెన్నో. అయితే కొందరు హీరోలకు మాస్ అంటే ఒక లిమిట్ ఉంటుంది. మాస్ సినిమాలు ఇక చాలు బాబు అనేలా ఉంటుంది. కానీ బాలయ్య విషయంలో అలా కాదు. ఇంతకంటే మాస్ ఏం చూపిస్తారులే అనుకునేలోపే.. మాస్ కా బాప్ లాంటి సినిమా చేయడం బాలయ్య స్టైల్. సింహా, లెజెండ్, అఖండ లాంటి సినిమాల్లో బాలయ్యలోని కొత్త మాస్ హీరోని చూపించాడు బోయపాటి. మరి ఇంతకంటే మాస్ ఇంకేం ఉంటుంది అనుకుంటే.. వీరసింహారెడ్డిలో బాలయ్య చేసిన మాస్ తాండవానికి థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఇక డాకు మహారాజ్ అయితే నెక్స్ట్ లెవల్ ఆఫ్ మాస్ మూవీ అని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. డేకేడ్ బెస్ట్ ఇంటర్వెల్ బ్యాంగ్ అంటే ఇప్పటికి దాకు మహారాజ్ అనే చెప్పాలి. ఇక బాలయ్య వింటేజ్ మాస్ మొత్తం చూపించారులే అనుకునే టైమ్ లో బాలయ్య మాస్ దాహం మాత్రం ఇప్పట్లో తీరేది కాదని సరికొత్త మాస్ ని పరిచయం చేసాడు దర్శకుడు గోపిచంద్ మలినేని. లేటెస్ట్‌గా వచ్చిన ఎన్బీకె 111 టీజర్ చూస్తే.. ఈ విషయం అర్థమవుతుంది. ఈసారి వింటేజ్ బాలయ్యను కాకుండా.. న్యూ ఏజ్ బాలయ్యను చూపించాడు. ఈ టీజర్ చూస్తే..

స్టైలిష్ లుక్‌తో బాలకృష్ణ మాస్‌ను 'జెన్-జీ' ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయబోతున్నాడు గోపీచంద్. దానికి తోడు.. బాలయ్య అంటే ఊగిపోయే తమన్, మరోసారి తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పూనకాలు తెప్పించాడు. ఏదేమైనా.. గాడ్ ఆఫ్ మాసెస్ అంటే ఆ మాత్రం ఉంటది మరి!



# దురంధర్ బాగా నచ్చింది: పవన్ కళ్యాణ్



ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో సూపర్ హిట్ అందుకున్న చిత్రం 'ధురంధర్'పై ఇప్పటికే సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా దీని ఫ్యాన్స్ లిస్ట్‌లో అగ్ర కథానాయకుడు పవన్ చేరారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'ధురంధర్', 'బారాముల్లా' చిత్రాల గురించి మాట్లాడారు. 'ధురంధర్' మొదటి భాగం తనకు నచ్చిందని పవన్ చెప్పారు. కథను చాలా ధైర్యంగా చూపించారని అన్నారు. దర్శకుడు ఇలాంటి గొప్ప కథను తెరకెక్కించిన విధానం ఆకట్టుకుందన్నారు. ముఖ్యంగా మేకింగ్ స్టైల్ బాగుందని ప్రశంసించారు. తాను బిజీగా ఉండడం వల్ల 'ధురంధర్ 2' చూడలేకపోయినట్లు వెల్లడించారు. ఇక తనకు హారర్ జానర్ సినిమాలంటే ఇష్టమని తెలిపిన పవన్ 'బారాముల్లా' గురించి ప్రస్తావించారు. 1980ల చివర్లో తాను షూటింగ్‌ల కోసం శ్రీనగర్ వెళ్లిన రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాకు హారర్ సినిమాలు చూడడం అంటే ఆసక్తి. అవి మన మనసును కథలో పూర్తిగా లీనం చేస్తాయి. నాకు నిద్ర రానప్పుడు ఏదైనా హారర్ సినిమా చూస్తాను. కశ్మీర్ నేపథ్యంలో తెరకెక్కిన 'బారాముల్లా' నాకు పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. నేను 1987-1989లో షూటింగ్‌ల కోసం కశ్మీర్ వెళ్తుండేవాడిని. అప్పుడే అక్కడ గందరగోళాన్ని స్వయంగా చూశాను. కశ్మీరీ పండిట్లు పడిన బాధలను గమనించాను. ఎవరైనా గెట్‌అవుట్.. ఇక్కడినుంచి వెళ్లిపోండి అంటే నాకు నచ్చదు. దాన్ని భరించడం చాలా కష్టం. బహుశా 'బారాముల్లా'లో ఉన్న ఆ భావోద్వేగమే నాకు సినిమా నచ్చేలా చేసిందేమో' అని చెప్పారు.

# సింగీతం.. దర్శక భీష్మాచార్యులు

## సింగ్ గీతం విజయం సాధించాలన్న చిరంజీవి

తెలుగు సినిమా పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు భీష్మాచార్యుడని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన చిత్రం 'సింగ్ గీతం' . నాగ్ అశ్విన్ నిర్మాతగా వ్యవహరించారు. జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. సింగీతం శ్రీనివాసరావు.. తెలుగు సినిమా పరిశ్రమకు ఆస్తి, ఒక నిధి. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించడమే కాకుండా, ఎంతోమంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడయ్యారు. అలాంటి మహోన్నత వ్యక్తి దర్శకత్వంలో రూపొందిన 'సింగ్ గీతం' ఈనెల 12న విడుదల కానుంది. ఇది ఇండియన్ సినిమాలో మరొక మైలురాయిగా నిలవాలని, పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే ఇలాంటి పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవాన్ని కొత్తతరానికి అందించే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

ఒకవైపు ఆనాటితరానికి ప్రతినిధిగా నిలిచిన సింగీతం మరోవైపు ఈతరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్.. వీరి కాంబో ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. అలాగే ఈ చిత్రానికి, నాకెంతో ఇష్టమైన దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించడం మరింత ఉత్సాహాన్ని కలగజేస్తుంది' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇందులోభాగమైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'సింగ్‌గీతం'. ఇది ఓ గ్రామంలోని ప్రజలకు ఎదురైన వింత సమస్య చుట్టూ తిరిగే కథ. కొన్ని అనూహ్య పరిణామాల తర్వాత ఆ ఊరి వాసుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థుల గందరగోళాన్ని.. తమ వింత పరిస్థితికి సమాధానం వెతికే ప్రయత్నాల్ని ఇందులో వినోదాత్మకంగా ఆవిష్కరించారు. ఇలాంటి సీనియర్ దర్శకులను గౌరవిస్తూ, వారి అపారమైన అనుభవాన్ని కొత్త తరానికి అందించాలనే అద్భుతమైన ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ నిర్మాత నాగ్ అశ్విన్‌ను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు.

# మీరే నా సర్వస్వం..సర్

భారతీరాజాను తలచకుంటూ రాధిక ఉద్వేగం దిగ్గజ దర్శకుడు భారతీరాజా తో నటి రాధికకు విడదీయరాని అనుబంధం ఉంది. భారతీరాజాను తన గురువుగా భావించే రాధిక సందర్భం వచ్చినప్పుడల్లా ఆయనపై ఉన్న అభిమానాన్ని వెల్లడిస్తూనే ఉంటారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానంటూ తాజాగా వరుస పోస్ట్‌లు పెట్టారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'మీరే నా సర్వస్వం..' అని రాసుకొచ్చారు. ఆయన లేరని తెలిసి తన హృదయం ముక్కలైందన్నారు. నన్ను తీర్చిదిద్దిన వ్యక్తులు ఇద్దరు. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం వాళ్లే. ఒకరు నా తల్లి, మరొకరు నా గురువు భారతీరాజా. ఒక్క ఏడాదిలోనే వీళ్లిద్దరినీ నేను కోల్పోయాను. ఈ వేదనను మాటల్లో వివరించలేకపోతున్నాను. ఏం చెప్పాలో కూడా అర్థం కావడం లేదు. హృదయం బరువెక్కింది. నా బాధను అర్థం చేసుకుని, నాతో పాటు నిలబడి,



అండగా నిలిచిన ప్రతిఒక్కరికీ నేను తలవంచి నమస్కరిస్తున్నాను. వారి జ్ఞాపకాలు, వారు నాకు నేర్పిన జీవిత పాఠాలు నాతో ప్రయాణిస్తూనే ఉంటాయని రాసుకొచ్చారు. ఇక సినీ వేడుకల్లో భారతీరాజా అంటే తనకు ఎంత ఇష్టమో చెప్పిన వీడియోను ఆమె పంచుకున్నారు. 'భారతీరాజా సర్.. మీరే నా సర్వసం. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అని క్యాప్షన్ పెట్టారు. రాధికను ఇండస్ట్రీకి పరిచయం చేసింది భారతీరాజానే. 1977లో వచ్చిన తమిళ మూవీ '16 వయథినిలే'తో దర్శకుడిగా మారిన ఆయన తన రెండో సినిమా 'కిళక్కే పొగమ్ రైల్'తో రాధికను నటిగా కోలీవుడ్‌కు పరిచయం చేశారు. ఆ సినిమా హిట్ కావడంతో ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ఆమెను స్టార్ హీరోయిన్‌గా తీర్చిదిద్దిన గురువుగా భారతీరాజాపై రాధికకు అపారమైన గౌరవం ఉంది. ఆయన కూడా తన విజయాల్లో రాధిక భాగమని ఎప్పుడూ చెప్పేవారు. ఇటీవల కూడా రాధిక ఆయన్ని కలవగా.. ఆమె నటించిన 'తాయ్‌కిళవి'కి నేషనల్ అవార్డు వస్తుందని ప్రోత్సహించారు. 'వస్తే మీ పాదాల దగ్గర పెడతాను' అని ఆమె తన గురువుపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం రాధిక షేర్ చేసిన పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి.

# ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న భవానీ శంకర్

న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యా÷-టకెన్రెస్‌గా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ఫ్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్ . శివ నిర్వాణ- రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది ప్రియ. అలాగే దూత సీక్వెల్‌లోనూ కంటిన్యూ కాబోతుంది. రీసెంట్లీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రియా ఎ÷-లాప్స్ పట్టించుకోకుండా టాలీవుడ్ ఆఫర్స్ ఇస్తోంది.. మరీ మేడమ్ వాటిని సద్వినియోగం చేసుకుంటుందో లేదో.

--------------

